పల్లెల్లో పడకేసిన వైద్యం

- కొనసాగుతున్న పీహెచ్‌సీ వైద్యుల సమ్మె
- వారం రోజులుగా వైద్య సేవలు బంద్
- తీవ్ర ఇబ్బందుల్లో గ్రామీణులు

గుడిబండ: పల్లెల్లో వైద్యం పడకేసింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉండే వైద్యులు సమ్మెబాట పట్టడంతో ప్రజలకు వైద్య సేవలు దూరమయ్యాయి. తమ సమస్యలు పరిష్కారం, డిమాండ్లు నెరవేర్చడంలో ప్రభుత్వ నిర్లక్ష్యం వహిస్తోందంటూ వైద్యులు సమ్మెకు దిగడంతో గ్రామీణులకు వైద్య సేవలు అందడం లేదు. అత్యవసర సేవలకు మాత్రమే వైద్యం అందిస్తుండటంతో అప్పులు చేసి మరీ ప్రైవేట్ అస్పత్రులు, క్లినిక్‌లను ఆశ్రయించాల్సిన దుస్థితి నెలకొంది. ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టామని చెబుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితి దారుణంగా తయారయ్యాయన్న విమర్శలున్నాయి.

సెప్టెంబరు 28 నుంచి..

డిమాండ్ల పరిష్కారమే లక్ష్యంగా సెప్టెంబర్ 28వ తేదీ నుంచి పీహెచ్‌సీ (ప్రాథమిక ఆరోగ్య కేంద్రం) వైద్యులు నిరసన బాటపట్టారు. అక్టోబరు ఒకటో తేదీ నుంచి పీహెచ్‌సీ విధులకు దూరమై చలో విజయవాడ కార్యక్రమానికి హాజరయ్యారు. దీంతో వారం రోజులుగా పీహెచ్‌సీలు వెలవెలబోతున్నాయి. వైద్య సేవల కోసం వచ్చే రోగులు కూడా వైద్యులు లేరని తెలుసుకుని వచ్చిన దారినే వెళ్లిపోతున్నారు.

రోజుకు వంద ఓపీలు

అసలే వర్షాకాలం.. సీజనల్ వ్యాధులు ప్రబలే కాలం.. ఈ సమయంలో వైద్యులు లేకపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో రోగులు అధికమవుతున్నాయి.



వైద్య సిబ్బంది లేక నిలిచిన 104 వాహనం

గుడిబండ మండలంలో 15 పంచాయితీలు ఉండగా మోరబాగల్, గుడిబండ, గుండుమల పీహెచ్‌సీలున్నాయి. మడకశిర అర్బన్ మండలంలో 16 పంచాయితీలు కల్లుమర్రి, నీలకంఠాపురం, కదిరేపల్లి, పీహెచ్‌సీలున్నాయి. అలాగే రొళ్ల మండలం 10 పంచాయితీలకు ఒక సీహెచ్‌సీ, అగళి మండలంలో 13 పంచాయితీలకు అగళిలో పీహెచ్‌సీ కేంద్రం ఉంది. అమరాపురం మండలంలో 11 పంచాయితీలకు అమరాపురం, హేమావతి పీహెచ్‌సీలు ఉన్నాయి. రోజుకు సగటున 100 ఓపీలు వరకూ వస్తాయని, ప్రస్తుతం రెగ్యులర్ వైద్యులు అస్పత్రుల్లో అందుబాటులో లేకపోవడంతో వైద్యం కష్టమవుతుందని డిప్యుటేషన్‌పై వస్తున్న వైద్యులు చెబుతున్నారు.

నిలిచిన 104 వాహన సేవలు

షెడ్యూల్ ప్రకారం గ్రామాలకు వెళ్లి వైద్య సేవలు అందించాల్సిన 104 వాహన సేవలు సైతం వైద్యులు లేకపోవడంతో నిలిచిపోయాయి. ప్రస్తుతం ఏ గ్రామానికి 104 వాహనం వెళ్లకపోవడంతో పీహెచ్‌సీల వద్దనే వాహనాలు ఉంటున్నాయి. దీంతో గ్రామీణ ప్రాంతాల్లోని వృద్ధులు, గర్భిణులు, బాలింతలు వైద్యం అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

గతమెంతో ఘనం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గ్రామీణ ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందేవి. నాడు– నేడు పేరుతో పీహెచ్‌సీలను అభివృద్ధి చేసి, ఏరియా ఆస్పత్రిలో ఏ విధంగా అయితే వైద్యసేవలు అందుతాయో ఆ విధంగా తయారు చేశారు. అలాగే ప్రతి సచివాలయం పరిధిలో హెల్త్ వెల్ నెస్ సెంటర్ నిర్మించారు. ప్రతి పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులను నియమించి, పేదలకు ప్రభుత్వం వైద్యం దగ్గర చేశారు. ఇప్పుడు వైద్యం పడకేడంతో ప్రజలు కూటమి ప్రభుత్వంపై మండిపడుతున్నారు.

వైద్యం అందేలా చూడాలి



గుడిబండలో ఉన్న పీహెచ్‌సీపై ఐదు గ్రామాల ప్రజలు ఆధారపడుతున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రజలకు ఈ పీహెచ్‌సీ పెద్దదిక్కు. వారం రోజులుగా వైద్యులు అందుబాటులో లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 104 వాహన సేవలు కూడా ఆగిపోయాయి. వైద్యులు తక్షణమే విధుల్లోకి వచ్చేలా ప్రభుత్వం చొరవతీసుకోవాలి.

– రంగస్వామి, తాళికెర సర్పంచ్, గుడిబండ మండలం

అరకొర వైద్య సేవలే..



కొద్ది రోజులకు ముందు నా కాళ్లకు గాయాలయ్యాయి. ఈ గాయాలతో తీవ్రంగా జ్వరంతో బాధపడుతూ చికిత్స కోసం ప్రభుత్వ పీహెచ్‌సీలోకి వెళ్లాను. అరకొరగానే వైద్యం అందించారు. వైద్యులు అందుబాటులో లేరన్న విషయం అప్పుడు తెలిసింది. ముఖ్యంగా పేదలను తీవ్రంగా ఇబ్బందులు గురి చేస్తున్నారు. పూర్తిస్థాయి చికిత్స కోసం ప్రైవేట్ ఆస్పత్రులపై ఆధారపడవలసి వస్తోంది. వైద్యులు తక్షణమే విధుల్లోకి వచ్చేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలి.

– అంజప్ప, కొంకల్లు, గుడిబండ మండలం

క్లుప్తంగా

సీఈసీ సభ్యుడు తిప్పేస్వామికి సన్మానం



తిప్పేస్వామిని సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మడకశిర: స్థానిక మాజీ ఎమ్మెల్యే, సీఈసీ సభ్యుడు తిప్పేస్వామిని గురువారం స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ఘనంగా సన్మానించారు. వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడిగా తిప్పేస్వామిని నియమించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, సీనియర్ పార్టీ నాయకులు మంజునాథ్, మాజీ జేసీఎస్ కన్వీనర్ నాగేంద్ర, సర్పంచులు రంగనాథ్, శివగంగప్ప, సుధీర్‌రెడ్డి, మధు, గుండుమల నగేష్, మనూర్ నరేష్ పాల్గొన్నారు.

మెడికల్ ల్యాబ్ ప్రారంభం

సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద రూ.50 లక్షలతో నిర్మించిన మెడికల్ ల్యాబ్‌ను మంత్రి సవిత గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో కూడా మెరుగైన వైద్య సదుపాయాలు అందించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. కార్యక్రమంలో నగర కార్పొరేషన్ చైర్మన్ వెంకటరమణ, వైద్యుడు ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ లైన్ మార్పు



విద్యుత్ లైన్ మారుస్తున్న ట్రాన్స్‌కో అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

రొద్దం: మండల కేంద్రంలోని హౌసింగ్ కాలనీలో రెండేళ్లుగా ప్రమాదంగా ఉన్న 11 కేవీ విద్యుత్ వైర్లపై ఇటీవల సాక్షిలో 'పొంచి ఉన్న ప్రమాదం' అన్న శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన ట్రాన్స్‌కో అధికారులు గురువారం నివాసపు ఇళ్లపై ప్రమాదరంగా ఉన్న 11 కేవీ విద్యుత్ లైన్‌ను మార్పుచేసి సమస్యను పరిష్కరించారు. సమస్య పరిష్కారమయ్యేలా చేసిన 'సాక్షి'కి కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు.

13న ధర్మ ఆమరణ దీక్ష



మాట్లాడుతున్న నాయకులు

హిందూపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో ప్రజా సేవాలో ఎంతో చరిత్ర ఉన్న ఆర్టీటీ పరిరక్షణకు ప్రజలు ఐక్యంగా ఉద్యమించాలని నాయకులు పిలుపునిచ్చారు. 'సేవ్ ఆర్టీటీ .. సేవ్ అనంత నినాదంతో ఉద్యమం ప్రారంభమైందన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. ఈనెల 13న అనంతపురంలో ధర్మ ఆమరణ నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో జై భీమ్ పార్టీ నాయకులు ఊటకూరు నాగరాజు, ఎంఎస్‌ఎఫ్ రవికుమార్, జై భీమ్ సేన రాష్ట్ర అధ్యక్షుడు సాకే ఓబులేసు, వ్యవస్థాపక అధ్యక్షుడు రామాంజనేయులు, బీబీఎస్ జిల్లా అధ్యక్షుడు బి.రమేష్, బీబీఎస్ మండలాధ్యక్షుడు ఓబుళపతి పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్ పంపిణీ



విద్యార్థులకు స్కాలర్‌షిప్ పత్రాలనందిస్తున్న దృశ్యం

పావగడ: పట్టణంలోని సాయిరాం మందిరంలో గురువారం శ్రీ క్షేత్ర ధర్మ స్థల గ్రామాభివృద్ధి యోజన స్కాలర్ షిప్ పంపిణీ జరిగింది. ఆ సంస్థ తాలూకా యోజనాధికారి మహేశ్ మాట్లాడుతూ 395 మంది గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులకు ప్రతి నెలా రూ 2.4 లక్షలు అందిస్తున్నామన్నారు. అలాగే మన ఊరు మన చెరువు, జ్ఞాన దీపం, జ్ఞాన వికాసం, ఆరోగ్య రక్ష బీమా, పాఠశాలలకు డెస్కులు, బెంచ్‌లు, వాటర్ ఫిల్టర్లు అందించామన్నారు. రైతు సంఘం నాయకుడు నరసింహారెడ్డి, అశ్వర్థ కుమార్, రాజగోపాల్, లోకేశ్ రత్నమ్మ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై దృష్టి సారించండి

అమరాపురం: మండలంలోని వీఆర్వోలు ప్రజల నుంచి వచ్చే సమస్యలపై దృష్టి సారించాలని తహసీల్దార్ లక్ష్మీనారాయణ సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో ఆయన సమావేశమై పలు సూచనలు, సలహాలిచ్చారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

రొళ్ల: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం సమావేశం మందిరంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు సాధారణ మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నాగేశ్వరశాస్త్రీ ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, మండలాధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.

మడకశిరలో అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ కార్యాలయం ఏర్పాటు

మడకశిర: మడకశిర కేంద్రంగా అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ కార్యాలయాన్ని టూరిజం గెస్ట్ హౌస్‌లో ఆ శాఖ అధికారులు ఏర్పాటు చేశారు. గతంలో ఈ కార్యాలయం పెనుకొండ కేంద్రంగా ఉండేది. అయితే మడకశిర నియోజకవర్గంలో బీసీ సంక్షేమశాఖ హాస్టళ్లు 14 ఉన్నాయి. పెనుకొండ నియోజకవర్గంలో కేవలం రెండు హాస్టళ్లు మాత్రమే ఉన్నాయి. దీంతో ఈ కార్యాలయాన్ని పెనుకొండ నుంచి మడకశిరకు తరలించారు. పరిపాలనా సౌలభ్యం కోసం బీసీ హాస్టళ్లు ఎక్కువగా ఉన్న మడకశిర నియోజకవర్గంలో ఈ కార్యాలయాన్ని ఏర్పాటు చేసినట్లు అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ గంగాధర్ తెలిపారు. అలాగే కొత్తగా నీలకంఠాపురంలో బాలికల బీసీ సంక్షేమ హాస్టల్‌ను కూడా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. మడకశిరలో మరో 10 బీసీ హాస్టళ్లను ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు పంపామన్నారు.

చిలమత్తూరులో మోస్తరు వర్షం

చిలమత్తూరు: మండలంలో గురువారం తెల్లవారుజామున ఉరుములతో కూడిన వర్షం కురిసింది. మండలంలో పలుచోట్ల కురిసిన వర్షానికి పంటలకు కాస్త ఉపశమనం దక్కినట్లు అయింది.

ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్ల నిరసన



ఆర్టీసీ డిపో వద్ద నిరసన తెలుపుతున్న ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్లు

హిందూపురం: తమకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని ఆర్టీసీ డిపో వద్ద గురువారం అద్దె ఆర్టీసీ బస్సుల డ్రైవర్లు బస్సులను ఆపేసి నిరసనకు దిగారు. బస్సు డ్రైవర్లు మాట్లాడుతూ కర్నూలు జిల్లా ఆత్మకూరు వద్ద ఆర్టీసీ డ్రైవర్‌పై దాడికి పాల్పడ్డారని, పలుచోట్ల చిన్న చిన్న విషయాలకు కూడా ప్రయాణికులు విమర్శలు చేస్తూ విరుచుకుపడుతున్నారని వాపోయారు. బస్సులో 50 మంది ప్రయాణించాల్సి ఉండగా 100, 120 మంది ప్రయాణికులు బస్సుల్లో ఎక్కుతున్నారని ఏమైనా జరిగితే డ్రైవర్‌పై కేసులు పెడుతూ ఇబ్బందులు గురిచేస్తున్నారని వాపోయారు. భద్రత కల్పించేంత వరకూ బస్సులు తీయబోమన్నారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఆర్టీసీ అధికారులు తెలిపారు.

భవిష్యత్‌కు బాటలు వేసుకోండి



మాట్లాడుతున్న సీఐ నగేష్‌బాబు

మడకశిరరూరల్: ప్రాథమిక దశ నుంచే విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోవాలని సీఐ నగేష్‌బాబు సూచించారు. గురువారం మండల పరిధిలోని వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాలలో యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ యాంటీ ర్యాగింగ్ కమిటీలోని సభ్యుల పాత్ర, చట్టాలను వివరించారు. కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ సరోజినీదేవి, ప్రొఫెసర్ డాక్టర్ హరిబాబు, ఎస్ఐ సుమన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాన్షీరామ్‌కు ఘన నివాళి



కాన్షీరామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

హిందూపురం: బీఎస్పీ వ్యవస్థాపకుడు కాన్షీరామ్ వర్ధంతిని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి శ్రీరాములు ఆధ్వర్యంలో పట్టణంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాన్షీరామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శ్రీరాములు మాట్లాడుతూ బహుజనుల అభ్యున్నతి కాన్షీరామ్ పోరాటాలు చేశారన్నారు. బెహన్ మాయావతి నాయకత్వంలో మహనీయుల ఆశయాలు కొనసాగిస్తామంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో నారాయణప్ప, గంగప్ప, శ్రీనివాసులు, నరసింహప్ప, నాగరాజు స్వామి, కొండప్ప, చంద్రశేఖర్, రవి కుమార్, గంగాధరప్ప తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేయండి



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి సవిత

పెనుకొండ: గ్రామాల అభివృద్ధికి అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళీశాఖామంత్రి సవిత అధికారులకు సూచించారు. పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో గురువారం మంత్రి సవిత రొద్దం, పెనుకొండ మండలాలకు చెందిన వివిధ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. ఇప్పటి వరకు చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, భవిష్యత్‌లో చేపట్టాల్సిన పనులపై చర్చించారు. అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలన్నారు.

ఆలయాభివృద్ధికి విరాళం



హలుకూరు కాంతరాజును ఆహ్వానిస్తున్న గ్రామస్తులు

రొళ్ల: మండల పరిధిలోని టీడీ పల్లిలో నూతనంగా నిర్మిస్తున్న వీరాంజనేయస్వామి ఆలయం నవంబర్ 3న ప్రారంభించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు హలుకూరు కాంతరాజుకు గ్రామానికి చెందిన యువకులు ఆహ్వాన పత్రిక అందించారు. ఈ సందర్భంగా ఆయన ఆలయాభివృద్ధికి తనవంతుగా రూ.35 వేలు విరాళంగా అందించారు.

ఘనంగా పోస్టల్ దినోత్సవం



ర్యాలీలో పాల్గొన్న పోస్టల్ సిబ్బంది

హిందూపురం: తరతరాలుగా ప్రజలకు చేరువగా ఉంటూ సేవలు అందించిన తపాలశాఖను ప్రజలు నేటికీ ఆదరిస్తున్నారని హిందూపురం పోస్టల్ సూపరింటెండెంట్ విజయ్‌కుమార్ అన్నారు. ప్రపంచ తపాలా దినోత్సవం సందర్భంగా ఉద్యోగులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. హెడ్ పోస్టమాస్టర్ మార్కండేయులు , పోస్టల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



గుంతలోకి దిగిన టాటాఏస్

అమరాపురం: మండల పరిధిలోని తమ్మడేపల్లి చెరువు కట్ట కింద గంగమ్మ బావి సమీపంలో ఓ టాటా ఏస్ వాహనం అకస్మాత్తుగా గుంతలోకి దిగి ఓ వైపునకు వంగిపోయింది. అందులో ప్రయాణిస్తున్న కూలీలకు, డ్రైవర్‌కు ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. గుణేహళ్లి నుంచి క్యాదిగుంటకు వెళ్తుండగా ఈ ఘటన జరిగింది. గ్రామస్తులు వచ్చి ట్రాక్టర్ సహాయంతో వాహనాన్ని బయటికు తీశారు.

బాలికల సంరక్షణ అందరి బాధ్యత





హిందూపురంలోని రాజీవ్ సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు, గుండుమలలో...

పరిగి: బాలికల సంరక్షణ అందరి బాధ్యత అని వక్తలు పేర్కొన్నారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా గురువారం మండల కేంద్రం పరిగిలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దారు హసీనా సుల్తానా, ఎంఈఓ లక్ష్మీదేవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లలిత, ఏపీఎం రామేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జనసేనా, బీజేపీ నాయకులు అవసరం లేదా?

మండల పరిధిలో జరిగిన కార్యక్రమానికి కూటమి ప్రభుత్వంలో భాగమైన జనసేన, బీజేపీ నాయకుల అవసరం లేదా అని స్థానిక జనసేన నాయకుడు, స్కూల్ పేరెంట్స్ కమిటీ చైర్మన్ అశ్వర్థ ప్రశ్నించారు. కేవలం కూటమి నాయకులంటూ పేరు పెట్టుకుని అందులో పూర్తిగా టీడీపీ నాయకులకే ఆహ్వానాలను పంపి కనీసం తమకెలాంటి వారికి ప్రాతినిధ్యం కల్పించకపోగా ఆహ్వానాన్ని అందించకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు.

హిందూపురం టౌన్: ఆడపిల్లలను రక్షించుకోవడం, చదివించుకోవడం అందరి బాధ్యత అని వక్తలు పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని కేజీబీవీ, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. మునిసిపల్ చైర్మన్ డీఈ రమేష్ కుమార్, టూ టౌన్ సీఐ కరీం, సీడీపీఓ వరలక్ష్మి వివిధ అంశాలపై అవగాహన కల్పించారు.

అమరాపురం: బాలికలను బాగా చదివించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సన్నమ్మ సూచించారు. బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం అంగన్‌వాడీ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బేటీ పడావో బేటీ బచావో అని నినాదాలు చేశారు.



పరిగి: వైఎస్సార్ సర్కిల్‌లో ...

రొళ్ల: బాలురకు దీటుగా బాలికలు ఉన్నత చదువులు చదవాలని అంగన్వాడీ వర్కర్లు ఇందిరమ్మ, భాగ్యమ్మ తదితరులు పేర్కొన్నారు. బాలికా దినోత్సవం సందర్భంగా గురువారం మండల పరిధిలోని హొట్టేబెట్టలో బాలికలకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. అనంతరం బాలికలతో కలిసి గ్రామ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు.

మడకశిరరూరల్: మండలంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో బాల్య వివాహాలు, లింగ వివక్షత, పరిశుభ్రతపై గురువారం గుండుమల గ్రామంలో కేజీబీవీ, ఉన్నత, గురుకుల పాఠశాలల విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. సీడీపీఓ నాగమల్లేశ్వరి మాట్లాడుతూ అంతర్జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా మూడు రోజుల పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

లేపాక్షి: అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా అంగన్‌వాడీ సిబ్బంది, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికల హక్కులు, ప్రాముఖ్యత తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈఓలు నాగరాజు, కుళ్లాయప్ప, సూపర్‌వైజర్ శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

రాకేశ్ కిశోర్‌కు ఉరిశిక్ష విధించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న దళిత సంఘం నాయకులు

పావగడ: సుప్రీంకోర్టు సీజేఐ బీఆర్ గవాయిపై దాడికి యత్నించిన న్యాయవాది రాకేశ్ కిశోర్‌కు ఉరి శిక్ష విధించాలని డిమాండ్ చేస్తూ స్థానిక దళిత సంఘం నాయకులు గురువారం పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. తాలూకా కార్యాలయం ఎదుట ప్రధాన రోడ్డులో రాస్తారోకో చేశారు. అనంతరం తాలూకా కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. మహా ఆదిగ రాజ్యాధ్యక్షుడు కృష్ణమూర్తి ఆధ్వర్యంలో తహసీల్దార్ వై రవికి వినతిపత్రం అందించారు.

సంక్షిప్త సమాచారం

ప్రభుత్వాస్పత్రిలో జీఎస్టీపై అవగాహన

హిందూపురం టౌన్: పట్టణంలో స్థానిక ప్రభుత్వాస్పత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ ఆధ్వర్యంలో సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్‌పై గురువారం అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథిగా మునిసిపల్ చైర్మన్ డీఈ రమేష్‌కుమార్ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ జీఎస్టీ 2.0 సంస్కరణల వల్ల ప్రాణ రక్షణ మందులు, ఆరోగ్య పరికరాలు కూడా తగ్గుతాయన్నారు.

చెకుముఖి టాలెంట్ టెస్ట్ పోస్టర్ల విడుదల

మడకశిరరూరల్: మండలంలో 8, 9, 10వ విద్యార్థులకు శాస్త్రీయ, వైజ్ఞానిక అంశాల పై నిర్వహించే చెకుముఖి టాలెంట్ టెస్ట్ పోస్టర్లను గురువారం జేవీవీ ఆధ్వర్యంలో ఎంఈఓ భాస్కర్ విడుదల చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 నరసింహమూర్తి, జిల్లా ఏబీఎస్‌టీఏ అధ్యక్షుడు మారుతీప్రసాద్, జిల్లా జేవీవీ కార్యదర్శి శ్రీనివాసులు పాల్గొన్నారు.

కారు బోల్తా

సోమందేపల్లి: మండలంలోని పాపిరెడ్డిపల్లి సమీపంలో కారు బోల్తాపడిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. బెంగళూరు నుంచి కుటుంబ సభ్యులు అనంతపురం వైపు వెళ్తుండగా అదుపుతప్పి జాతీయ రహదారి పక్కలోని గుంతల్లో దూసుకెళ్లింది. అందులో ఉన్న వారు సురక్షితంగా బయటపడినట్లు పోలీసులు తెలిపారు.

నాణ్యమైన భోజనం అందించాలి

హిందూపురం టౌన్: పట్టణ, మండల వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని అందించాలని ఏఐఎస్‌బీ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గురువారం ఎంఈఓ గంగప్పకు వినతిపత్రం అందించారు. మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులు తినలేక ఇళ్ల నుంచి బాక్సులు తెచ్చుకుంటున్నారని విమర్శించారు. విద్యాశాఖ అధికారులు ప్రతి పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్నిని తనిఖీ చేయాలని కోరారు.

యోగి వేమన విగ్రహ ఏర్పాటుకు కృషి

గోరంట్ల: మండలంలోని రెడ్డి కులస్తులు గురువారం స్థానిక చౌడేశ్వరీ దేవాలయంలో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. మండల వ్యాప్తంగా రెడ్డి కులస్తులు ఎదుర్కొంటున్న సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. రెడ్డి కులస్తులు రాజకీయాలకు అతీతంగా ఐకమత్యంతో మేలగాలని కుల పెద్దలు సూచించారు. గోరంట్లలో యోగివేమన విగ్రహ ఏర్పాటుకు కృషి చేయాలని సూచించారు.

సహకార రంగంలో ఎదగాలి

పరిగి: ప్రతి విద్యార్థి సహకార రంగంపై అవగాహన పెంచుకుని అంచలంచెలుగా ఎదగాలని జిల్లా సహకార సంఘం అధికారి కృష్ణానాయక్ తెలిపారు. మండలంలోని సేవామందిరం ఎస్‌లైట్ డిగ్రీ కళాశాలలో గురువారం జాతీయ సహకార విధానం 2025పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. హిందూపురం డివిజనల్ సహకార రంగం అధికారి ఆదినారాయణ, సబ్ డివిజనల్ అధికారి నారాయణమూర్తి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ రాగసుధ, తదితరులు పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

రొళ్ల: పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు చేసిన కృషి మరువలేనిదని ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు యంజారప్ప, హెచ్ఎం రవికృష్ణ తెలిపారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు గురుమూర్తి, చిన్నప్పయ్య, రమేష్ బాబు, ఖాదర్‌వలి, శ్రీనివాస్‌రెడ్డి, రోహిణి, స్వరూపరాణి, ప్రభాకర్, గంగప్ప, శ్రీనివాసులు, నరసింహమూర్తిలను పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు.

ఉచిత విద్యుత్ హామీని అమలు చేయండి

పెనుకొండ: చేనేత కార్మికులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ హామీని వెంటనే అమలు చేయాలని ఏపీ చేనేత కార్మిక సంఘం జిల్లా నాయకులు శీలా నారాయణస్వామి, సీపీఐ జిల్లా నాయకులు శ్రీరాములు రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళీశాఖామాత్యులు సవితను కోరారు. గురువారం పట్టణంలో మంత్రిని కలసిన పలువురు చేనేత కార్మికులు వివిధ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. చేనేత కార్మికులు గోవిందప్ప, దేవాంగం వెంకటేష్, దాసరి సుధాకర్, బెస్త కిష్టప్ప, కురుబ శ్రీనివాసులు, ఈడిగ నాగరాజు, పటాకుల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

జీవ వైవిధ్యం కాపాడాలి

పరిగి: వాతావరణ సమతుల్యాన్ని కాపాడటానికి జీవవైవిధ్యం దోహదపడుతుందని, జీవ వైవిధ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని సేవామందిరం ఏఎం లింగణ్ణ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గురువారం సేవామందిరంలో విద్యార్థులచే జీవ వైవిధ్యం (బయో డైవర్సిటీ)పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఉపాధ్యాయులు రామలింగయ్య, సునంద, మంజునాథ్, బాగ్యమ్మ, చంద్రశేఖరరెడ్డి, అనిల్, సుజాత, రాజసులోచన, భగత్ సింగ్ సేవాసమితి నాయకులు పాల్గొన్నారు.

గడువులోపు లక్ష్యాన్ని పూర్తి చేస్తాం

పెనుకొండ: పెనుకొండ పశు సంవర్ధక శాఖ సబ్ డివిజన్ పరిధిలో గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం 80 శాతం దాటిందని పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ గిరిజ తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ డివిజన్‌లోని ప్రతి మండలంలో సిబ్బంది వ్యాక్సిన్‌ను యుద్ధ ప్రాతిపదికన వేయడం జరుగుతోందన్నారు. డివిజన్‌కు 1,16,600 డోస్‌ల వాక్సిన్ అందగా 90 వేల డోస్‌లు ఇప్పటికే వేశామన్నారు. ఈ నెల 15 వరకూ గడువు వుందని నిర్ణీత గడువులోగా వంద శాతం టార్గెట్ పూర్తి చేస్తామన్నారు.

రేషన్ డీలర్‌పై ఫిర్యాదు

లేపాక్షి: మండల కేంద్రమైన లేపాక్షిలోని ఎఫ్‌పీ షాపు డీలర్ చంద్రశేఖర్‌పై లబ్ధిదారులు గురవారం ఉదయం తహసీల్దార్ సౌజన్యలక్ష్మికి ఫిర్యాదు చేశారు. కార్డు వినియోగదారులతో అసభ్యకరంగా మాట్లాడుతున్నారని, సమయ పాలన పాటించడం లేదని, బియ్యం పంపిణీలో అవకతవకలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. వెంటనే ఎఫ్‌పీ షాపును తనిఖీ చేశామని, లబ్ధిదారుల ఇచ్చిన ఫిర్యాదు నిజమని తేలడంతో ఆర్డీఓకు నివేదిక పంపామని తహసీల్దార్ సౌజన్య లక్ష్మి పేర్కొన్నారు.